బీసీ రిజర్వేషన్ల కోసం పోరుబాట







ఖాళీబిందెలతో రాస్తారోకో


AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in




## విధుల్లో లేని ఉద్యోగితో కేసులు పెట్టించారు..

**అక్షరటుడే, కోటగిరి:** విధుల్లో లేని జూనియర్ అసిస్టెంట్‌తో రైతులపై కేసులు బనాయించడం ఎంతవరకు సబబని బాధితులు ప్రశ్నించారు. పోతంగల్‌లో గురువారం వారు మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిని వదిలేసి.. అక్రమ రవాణాను అడ్డుకున్న రైతులపై కేసులు పెట్టడం సరికాదన్నారు. పబ్బ శేఖర్, యాదులు, సుదాం నవీన్, నాగేష్, గంధపు మోహన్, శీను పాల్గొన్నారు.





## కాలభైరవ స్వామి ఆలయాభివృద్ధికి కృషి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** రామారెడ్డి మండల కేంద్రంలోని కాలభైరవస్వామి ఆలయాభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పేర్కొన్నారు. కాలభైరవస్వామి జన్మదిన వేడుకల్లో గురువారం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి ఇస్సానపల్లి, రామారెడ్డి వీధుల్లో నిర్వహించిన రథయాత్రలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అగ్ని గుండాల కార్యక్రమంలో పాల్గొని, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాల భైరవస్వామి ఆలయం అత్యంత పవిత్రమైందన్నారు. ఈ ఆలయాన్ని దక్షిణ కాశీగా అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రముఖులు, సినీ తారలు, రాజకీయ నాయకులు కూడా ఇక్కడకు వచ్చి స్వామివారి ఆశీస్సులు అందుకుంటారన్నారు. తాను రామారెడ్డివాడినేని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. తన చిన్ననాటి జ్ఞాపకాలు అంతా కాలభైరవస్వామి ఆలయంతో ముడిపడి ఉన్నాయని.. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చిన్నప్పటి నుంచి స్వామివారి ఉత్సవాలను చూస్తూ, వాటిలో పాల్గొంటూ పెరిగానని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



# జిల్లాకు మంత్రి.. సుదర్శన్‌రెడ్డి

▸ ఆయన సారథ్యంలోనే పనిచేస్తాం ▸ టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ గౌడ్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వ సలహాదారు మాత్రమే కాదని.. ఆయన జిల్లాకు మంత్రి కూడా అని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. జిల్లా సీనియర్ నేత అయిన ఆయన సారథ్యంలోనే పనిచేస్తామని తెలిపారు. ప్రభుత్వ సలహాదారుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి జిల్లాకు వచ్చిన సందర్భంగా పాత కలెక్టరేట్ మైదానంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ నగర్ నుంచి బోర్గాం (పి) చౌరస్తా, వినాయకనగర్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా పాత జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సుదర్శన్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాను అభివృద్ధి చేస్తామని అన్నారు. జిల్లాకు మెడికల్ కళాశాలతో పాటు, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా 20, 21, 22 ప్యాకేజీ తీసుకురావడంతో తీసుకురావడంలో ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. అంతేకాకుండా 35 ఏళ్ల కల అయిన ఇంజినీరింగ్ కళాశాలను.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంజూరు చేశామని తెలిపారు. వ్యవసాయ కళాశాల కూడా తెలంగాణ యూనివర్సిటీలోనే ప్రారంభిస్తున్నామని, వెంటనే కౌన్సిలింగ్ మొదలు పెట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని గుర్తుచేశారు. టెంపుల్ కారిడార్ రోడ్డులో భాగంగా ధర్మపురి, కొండగట్టు, వేములవాడ, లింబాద్రిగుట్ట, బాసర వరకు కొత్త రోడ్డుకు రూ.370 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. లింబాద్రి గుట్ట, ఆర్మూర్ సిద్ధుల గుట్టలో టూరిజం గెస్ట్‌హౌజ్‌ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

> కాంగ్రెస్ సీనియర్ నేత, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జిల్లాకు మంత్రి. ఆయన సారథ్యంలో అందరు నేతలం పనిచేస్తాం. జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. ఇప్పటికే పలు పనులకు నిధులు మంజూరు చేశాం.
> – పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్

### రాష్ట్రంలో మేటి జిల్లాగా మారుస్తాం

సుదర్శన్‌రెడ్డి నాయకత్వంలో జిల్లాను వ్యవసాయ, విద్యా, పరిశ్రమలపరంగా ముందుకు తీసుకెళ్తామని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. యావత్ తెలంగాణలోనే నిజామాబాద్‌ను మేటి జిల్లాగా నిలుపుతామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలను దోచుకోవడం తప్ప.. వారి మేలు కోసం చేసిందేమీ లేదన్నారు.

### జిల్లా అభివృద్ధే ధ్యేయం

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధే తమ ధ్యేయమని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేటీఆర్, కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు. వచ్చే ఎలక్షన్లలో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కొంతమంది దద్దమ్మలు పనికిరాని మాటలు మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, నిరుద్యోగులు, యువకులకు తెలంగాణలో పెద్దపీట వేసిందన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక జిల్లాలో అనేక ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపడ్డాయని వివరించారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందుతోందని చెప్పారు.

కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, విజయకాంత్ రెడ్డి, నుడా ఛైర్మన్ కేశ వేణు, మాజీ మేయర్ సంజయ్, కవితా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## త్వరగా సోయా కొనుగోళ్లు పూర్తి చేయాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సోయాబీన్ కొనుగోళ్లను త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అధికారులను ఆదేశించారు. బిచ్కుంద మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నాఫెడ్, మార్క్‌ఫెడ్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా సోయాలు త్వరగా కొనుగోలు చేయాలని సూచించారు. అకాల వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి: ఎస్పీ




**అక్షరటుడే, కామారెడ్డి:** స్టేషన్ రైటర్లు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న రైటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రైటర్లు స్టేషన్లలో బాధ్యతతో వ్యవహరించాలన్నారు. విధులు, బాధ్యతలు, రికార్డ్ నిర్వహణ, వృత్తి నైపుణ్యాలపై ఎస్పీ రాజేష్ చంద్ర పలు సూచనలు అందజేశారు. ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. తప్పులు లేకుండా డాక్యుమెంట్లు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## వివాహ వేడుకలో పాల్గొన్న మంత్రి పొన్నం

**అక్షరటుడే, కామారెడ్డి/ఎల్లారెడ్డి:** రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కామారెడ్డి పట్టణంలోని సత్య కన్వెన్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొన్నారు. మంత్రి మేన కోడలి వివాహం కామారెడ్డి ప్రముఖ న్యాయవాది రాజగోపాల్ గౌడ్ కుమార్తెతో జరిగింది. మంత్రితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, ఎస్పీ రాజేష్ చంద్ర, కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రెటరీలు గడ్డం చంద్ర శేఖర్ రెడ్డి, బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఇటీవల ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన సుదర్శన్‌రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



కామారెడ్డిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న షబ్బీర్ అలీ

**అక్షరటుడే, నిజామాద్‌సిటీ/కామారెడ్డి :** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు గురువారం చెక్కులను పంపిణీ చేశారు. నిజా మాబాద్, కామారెడ్డిలో చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కులు నిరుపేదలకు ఆర్థికంగా ఉపశమనం కలిగిస్తాయన్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




నిజామాబాద్‌లో..

**ఉమ్మడి జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. దీంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. నాలుగు రోజులుగా చలి పెరగడంతో ఇబ్బందులు పడుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత 13 డిగ్రీలకు పడిపోవడం గమనార్హం. కొన్ని గ్రామాల్లో 10 డిగ్రీల ఉష్ణోగ్రతలు కూడా నమోదు అవుతున్నాయి.**

- అక్షరటుడే, ఇందూరు

# వణికిస్తున్న చలి



■ 13 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రత ■ ఇబ్బందులు పడుతున్న ప్రజలు ■ స్వెటర్లకు పెరిగిన గిరాకీ

ఉమ్మడి జిల్లాలో ఒక్కసారిగా చలి తీవ్రత పెరిగింది. దీంతో ఉదయం పనులు చేసుకునేవారు, మున్సిపల్ సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. దీంతో స్వెటర్లు, ఉలెన్ జాకెట్లు, మాస్క్‌లు, టోపీలకు గిరాకీ పెరిగింది. చలి నుంచి కాపాడుకునేందుకు ప్రజలు వీటిని కొనుగోలు చేస్తున్నారు. గతవారం 22 నుంచి 25 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత ఉండగా.. ఈ సోమవారం నుంచి 15 నుంచి 13 డిగ్రీలకు పడిపోయింది.

**నిజామాబాద్ జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు**

| వారం | ఉష్ణోగ్రత |
|---|---|
| సోమ | 15 |
| మంగళ | 15.7 |
| బుధ | 15.5 |
| గురు | 13.5 |

### జాగ్రత్తలు అవసరం...

చలికాలం ఆరోగ్యపరంగా జాగ్రత్తలు ఎంతో అవసరం. ప్రధానంగా చర్మ వ్యాధులు, ఊపిరితిత్తులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ఉదయం, రాత్రి సమయాల్లో అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా ఉండాలి. ప్రధానంగా వృద్ధులు, చిన్నపిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి.

### శారీరక శ్రమ తప్పనిసరి

చలికాలంలో శరీరం బిగుసుకుపోతుంది. దీంతో ఆరోగ్య సమస్యలు ఏర్పడే అవకాశం ఉంటుంది. కాబట్టి శారీరక శ్రమ అవసరం. ఉదయపు నడకతో పాటు వ్యాయామం చేస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఉదయం సమయంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటే కనీసం ఇంట్లోనైనా వ్యాయామం చేయడం మంచిది. మైదానంలోనూ నడక, వ్యాయామం చేసే సమయంలో వెచ్చని దుస్తులు ధరించడం శ్రేయస్కరం.

## లింబాద్రి గుట్ట అభివృద్ధికి ముందడుగు..



**అక్షరటుడే, భీమ్‌గల్:** భీమ్‌గల్ శివారులోని శ్రీ మన్నింబాచల క్షేత్రం లింబాద్రిగుట్ట అభివృద్ధికి ముందడుగు పడింది. ఇటీవల గుట్టపై లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. నృసింహస్వామి దర్శనం అనంతరం ఆలయాభివృద్ధికి హామీ ఇచ్చారు. ఈ మేరకు మహేశ్ కుమార్ గౌడ్ సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా చర్చించారు. లింబాద్రి గుట్ట విశేషాలను ఆయనకు వివరించారు. అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరారు. అలాగే టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును సైతం కలిసి లింబాద్రి గుట్ట అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గుట్టపై టూరిజం గెస్ట్‌హౌజ్, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని వివరించారు. దీంతో ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు గుట్టపై టూరిజం గెస్ట్‌హౌస్ కోసం రూ.4 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్మూర్‌లో ప్రసిద్ధమైన సిద్ధుల గుట్టపై కాటేజీల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. భక్తుల సౌకర్యార్థం కాటేజీల నిర్మాణం కోసం రూ.50లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



## ఎల్లారెడ్డి పట్టణంలో అమృత్ పనుల ప్రారంభం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలో అమృత్ 2.0 పథకంలో భాగంగా పైప్ లైన్ పనులను గురువారం ప్రారంభించారు. పట్టణంలో కొన్నిరోజులు క్రితం సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు ప్రారంభమైనప్పటికీ, వాటర్ పైప్‌లైన్ పనులు పెండింగ్‌లో పడ్డాయి. దీంతో రెండో వార్డు మాజీ సభ్యుడు విద్యాసాగర్ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. వెంటనే పనులు ప్రారంభించాల్సిందిగా కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు సూచించారు. దీంతో గురువారం నుంచి పనులు ప్రారంభం అయ్యాయి. పనులను పరిశీలించిన వారిలో మాజీ వార్డు సభ్యుడు విద్యాసాగర్, కాంగ్రెస్ నాయకులు పాషా, ఇంతియాజ్, మధు ఉన్నారు. రెండో వార్డులోని బీసీ కాలనీలో సైతం పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభానికి సహకరించిన ఎమ్మెల్యేకు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు. కాలనీవాసులు మహేష్, నరేష్ కుమార్ తదితరులున్నారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ అడ్మిషన్లకు ప్రత్యేక డ్రైవ్

**అక్షరటుడే, గాంధారి/ఎల్లారెడ్డి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్ల కోసం అధ్యాపకులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని పలు హైస్కూళ్లను ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం మాట్లాడుతూ.. ఇంటర్ కోర్సుల ప్రాధాన్యం, ప్రభుత్వ కళాశాలల్లో లభించే సదుపాయాలు, ఉచిత విద్య, ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి ప్రముఖ సంస్థలతో ఉచిత ఆన్‌లైన్ తరగతుల వివరాలను ఆయన విద్యార్థులకు వెల్లడించారు. ఐఐటీ జేఈఈ మెయిన్స్ నీట్ క్లాసులు, పాఠ్య పుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు, ల్యాబ్ సదుపాయాలు వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు బోధిస్తున్నారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తమ భవిష్యత్తును మెరుగుపర్చుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి హైస్కూల్‌కు వెళ్లి విద్యార్థులకు ఇంటర్ విద్యపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. 2026లో ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ల కోసం, తల్లిదండ్రులు, విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలాలకే రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు ఎన్.లక్ష్మణ్, శ్రీధర్, జెట్టి విజయకుమార్, రమేష్, సంబాజి, సరిత, సుజాత పాల్గొన్నారు.



# బీసీ రిజర్వేషన్ల కోసం పోరుబాట

- కామారెడ్డి కేంద్రంగా ఉద్యమానికి శ్రీకారం
- బీసీ డిక్లరేషన్ అమలు చేయాల్సిందేనంటున్న నేతలు
- 15న పట్టణంలో భారీ సభ

**రిజర్వేషన్ల కోసం బీసీ సంఘాలు పోరుబాట పట్టనున్నాయి. కామారెడ్డి కేంద్రంగా ఉద్యమానికి సిద్ధం అవుతున్నాయి. కామారెడ్డి వేదికగా గతంలో అనేక ఉద్యమాలు జరిగాయి. ఇక్కడి ప్రజలు చేపట్టిన పోరాటాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. తాజాగా కామారెడ్డి మరో ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారబోతుంది. కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు కోసం ఇక్కడి నుంచే పోరాటం మొదలు కాబోతోంది. ఈ మేరకు బీసీ జేఏసీ, బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 15న పెద్ద ఎత్తున సభ నిర్వహించనున్నారు.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి కొడంగల్‌తో పాటు, కామారెడ్డిలో పోటీ చేశారు. 2023 నవంబర్ 10న కామారెడ్డిలో నామినేషన్ వేయడానికి వచ్చిన సందర్భంగా ఇందిరాగాంధీ స్టేడియంలో బీసీ డిక్లరేషన్ సభ నిర్వహించారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో బీసీ డిక్లరేషన్ ప్రకటించారు. ఇందులో భాగంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అంతేగాకుండా ఇతర హామీలు సైతం ఇచ్చారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్‌పై అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్ ఆమోదానికి పంపింది. అయితే ఆ బిల్లు ప్రస్తుతానికి పెండింగ్‌లో ఉండగా బీసీ సంఘాలు రిజర్వేషన్ కోసం పట్టుబడుతున్నాయి.



### ఉద్యమానికి సిద్ధం

బీసీ రిజర్వేషన్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటం, ప్రభుత్వం తెచ్చిన జీవోను కోర్టు కొట్టివేయడంతో బీసీ సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమానికి సిద్ధమయ్యాయి. కామారెడ్డి కేంద్ర బిందువుగా ఉద్యమం చేపట్టాలని నిర్ణయించాయి. కామారెడ్డిలో బీసీ నేతలు వరుస పర్యటనలు, సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరిచే విధంగా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. 2023 నవంబర్ 10న కామారెడ్డి వేదికగా ప్రకటించిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో బీసీ జేఏసీ, బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో కామారెడ్డి వేదికగా ఉద్యమానికి పిలుపునిచ్చాయి. గురువారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో బీసీ పోరాట దీక్ష చేపట్టారు.. అలాగే రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 15న సత్య కన్వెన్షన్ హాల్‌లో బీసీ ఆక్రోశ సభ నిర్వహనకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ రెండు సభలు విజయవంతం కోసం నేతలు ప్రతిరోజు సంఘాల నాయకులతో సమావేశమై చర్చిస్తున్నారు.




### డిమాండ్స్ ఇవే

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో 21 హామీలు ఇచ్చారని నాయకులు చెబుతున్నారు. బీసీ రిజర్వేషన్లు, బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటుతో పాటు మిగతా హామీలను అమలు చేయాలని నాయకులు కోరుతున్నారు. రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చేలా బీసీ సంఘాలు ప్రణాళిక చేస్తున్నాయి. బీసీ రిజర్వేషన్లు పొందాలంటే.. తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్ లో చేర్చడమే పరిష్కార మార్గమని చెప్తున్నాయి. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నాయి. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలని కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని వివిధ వార్డుల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ గురువారం పరిశీలించారు. నిర్మాణాలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం నేడు కోటి దీపోత్సవం నిర్వహించే ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించి శానిటేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

**అక్షరటుడే, కోటగిరి:** పేద విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని కోనేరు శశాంక్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కోనేరు శశాంక్ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్, కేజీబీవీ, ఎత్తోండ జెడ్పీహెచ్‌ఎస్, ప్రభుత్వ పాఠశాలలో మొత్తం 197 మంది విద్యార్థులకు సంబంధించిన పరీక్ష ఫీజు రూ. 29,965ను ఎంఈవో శ్రీనివాస్ కు అందజేశారు. పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ప్యాడ్లను అందజేస్తామని ఆయన తెలిపారు. గతంలో పోతంగల్ ఉమ్మడి మండలాలలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిది వందల మంది విద్యార్థులకు బ్యాగులను ఉచితంగా అందజేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వేముల నవీన్, నాయకులు పుల్లల మోహన్ రావు, విలాస్. రుద్రూర్ మండల ప్రెసిడెంట్ ఆలపాటి హరికృష్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలి

**అక్షరటుడే, గాంధారి:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని జడ్పీ సీఈవో చందర్ పేర్కొన్నారు. మండలంలోని మడుగుతండా గ్రామంలో రెండు ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్‌లో ఆయన పాల్గొన్నారు. గాంధారి మండల కేంద్రంలో కూడా ఒక ఇంటికి మార్కింగ్ చేశారు. అనంతరం ఐకేపీ సిబ్బంది ఈజీఎస్ సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో చందర్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా ఇందిరమ్మ ఇళ్లపనులు పూర్తి చేసుకునేలా అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీఎం ప్రసన్న, ఆయా గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులు ఐకేపీ ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులను పంచాయతీ రాజ్ ఈఈ భావన్నతో కలిసి మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీయూఎఫ్ఐడీసీ నిధుల కింద జరుగుతున్న పనులు నాణ్యతతో ఉండాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ కిషన్, ఏఈ నితీష్, మున్సిపల్ ఏఈ కిరణ్, కాంట్రాక్టర్ ఈశ్వర్, అలాగే మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు రాహుల్, నవీన్ పాల్గొన్నారు.




## బీసీలకు రిజర్వేషన్లు కల్పించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

**అక్షరటుడే, ఇందూరు :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుంటే మరింత ఉధృతంగా ఉద్యమం కొనసాగిస్తామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌లో గురువారం బీసీల ధర్మ పోరాట దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో అష్టాదశ కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లో ధర్మ పోరాట దీక్ష నిర్వహించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొందరు అగ్రవర్ణాల నాయకులు కేసులు వేసి రిజర్వేషన్లను నిలిపివేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, దేవేందర్, రవీందర్, వినోద్ కుమార్, కొయ్యాడ శంకర్, శ్రీలత, చంద్రమోహన్, అజయ్, చంద్రకాంత్, ఆర్టీసీ శ్రీనివాస్, నగేష్, బాలన్న పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన పలువురికి జైలుశిక్ష

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన పలువురికి జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్ కోర్టు తీర్పునిచ్చింది. ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా 21 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం 13 మందికి రూ.10వేల చొప్పున జరిమానాలు విధించింది. అలాగే మరో 8 మందికి జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందని ట్రాఫిక్ ఏసీపీ పేర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడపం చట్టరీత్యా నేరమని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్‌అలీ పేర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వారితో పాటు ఎదుటివారికి కూడా ప్రమాదం పొంచి ఉందని ఆయన వివరించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించి బైక్‌లు నడపాలని సూచించారు.



## ఖాళీబిందెలతో రాస్తారోకో

**కోటగిరి మండలం లోని కొత్తపల్లిలో గ్రామస్థులు ఖాళీబిందెలతో రాస్తారోకో చేశారు. స్థానికంగా నీటి సమస్య ఉందని సింగిల్ ఫేజ్ మోటార్ బాగుచేయాలని పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవట్లేదని వారు వాపోయారు. మంచినీటి సమస్య తీర్చాలని వారు రోడ్డెక్కారు. నిరసనలో కాలనీవాసులు సాయిబాబా, పుప్పాల సాయిలు, రమేష్, శరత్, పోచయ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.** – అక్షరటుడే, కోటగిరి

## స్కూల్‌కు బెంచీలు, కుర్చీలు వితరణ

**అక్షరటుడే, గాంధారి**: మండలంలోని నేరల్ గ్రామంలోని పాఠశాలకు బెంచీలు, కుర్చీలను గ్రామస్థులు గురువారం అందజేశారు. విద్యార్థులు నేలపై కూర్చుని చదువుకోవడం ఇబ్బందిగా మారిందని పాఠశాల ఉపాధ్యాయురాలు ప్రశాంతి గ్రామ పెద్దలతో, యువకులతో గతంలో చర్చించారు. దీనిపై స్పందించిన గ్రామ ప్రజలు ఇంటింటికీ చందాలు వసూలు చేశారు. అనంతరం పాఠశాలకు 8 డ్యూయల్ డెస్క్ బెంచీలు, ఆరు కూర్చునే చైర్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఎంఈవో శ్రీహరి మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజల్లో ఇలాంటి చైతన్యం వస్తే.. సర్కారు స్కూళ్లు బాగుపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్షన్ చంద్రశేఖర్, గ్రామ పెద్దలు షేక్ అబ్బు, సంతోష్, శ్రీనివాస్, సాయిలు, గఫూర్, కార్యదర్శి రేణుక, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నాం..

**అక్షరటుడే, ఆర్మూర్:** నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ఎల్లవేళలా కృషి చేస్తున్నామని ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి పేర్కొన్నారు. నందిపేట్ మండలంలోని తల్వేద లక్కంపల్లి, చిమ్రాజ్ పల్లి, తల్వేద గ్రామాలకు రోడ్డు అభివృద్ధి పనుల నిమిత్తం రూ.6.90 కోట్లు మంజూరు కాగా ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్మూర్‌లోని పీవీఆర్ భవన్‌కు మూడు గ్రామాల ప్రజలు తరలివచ్చి వినయ్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మూడు గ్రామాల నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

